## క్లుప్తంగా

### 'పీఎంశ్రీ'కి రెండు పాఠశాలల ఎంపిక



ఆన్‌లైన్ ద్వారా పాఠ్యాంశాల బోధన పరికరాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: పీఎంశ్రీ పథకానికి మండలంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికైనట్లు ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ శుక్రవారం తెలిపారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన బడి నాడు–నేడు కార్యక్రమంతోపాటు ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ పథకం ద్వారా ప్రత్యేక నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులను, ఆన్‌లైన్ తరగతులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.జోష్‌మేరి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదనందిపాడు: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ కె.వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

### ప్లాస్టిక్ నిషేధంపై నేడు పొన్నూరులో సమావేశం

చేబ్రోలు: ప్లాస్టిక్ బ్యానర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీలను సమూలంగా నిర్మూలించేందుకు పొన్నూరు పురపాలక సంఘ పరిధిలోని యాడ్ ఏజెన్సీలు, ప్లాస్టిక్ ఫ్లెక్సీ దుకాణ యజమానులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ శుక్రవారం తెలిపారు. పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవరి 26 నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు వివరించారు.

### బజరంగ్ ఫౌండేషన్ కంటి వైద్యశిబిరం 27కు వాయిదా

పెదకాకాని: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించతలపెట్టిన ఉచిత కంటి వైద్య శిబిరం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఈ శిబిరాన్ని పెదకాకాని శ్రీ వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 27వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

### నేడు కట్టెంపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

చేబ్రోలు: పొన్నూరు రూరల్ మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించటంతోపాటు, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటిని పరిష్కరించనున్నారని వెల్లడించారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు



భాస్కరాచారి (ఫైల్)

గుంటూరు రూరల్: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం నల్లపాడు శ్రీనివాసకాలనీకి చెందిన సిరికోమలి మోహనరావు స్థానికంగా ఆలయంలో పూజారిగా పనిచేస్తుంటాడు. అతని కుమారుడు భాస్కరాచారి కొద్దిరోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మోహనరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# అపరాల పంటల క్షేత్రస్థాయి పరిశీలన



రైతులకు వేప నూనెను ఉచితంగా అందజేస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: పప్పు దినుసుల(అపరాల) పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించవచ్చని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు తెలిపారు. శుక్రవారం లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అమృతలూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కంది, మినుము, పెసర పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ముర్రాజాతి గేదెల పోషణపై పాడి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయంలో దేశీయ ఆవుల పాత్ర గురించి వివరించారు. వేపనూనెను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుబ్రమణ్యం, అగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ దీప, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అర్చన, దేవరకొండ రాము, అంబటి రామమోహన్‌రావు పాల్గొన్నారు.

# చిన్నారి శ్రావ్య మృతి బాధాకరం



తంగెళ్ళమూడి సర్పంచి కిషోర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: కుమార్తెను కోల్పోయిన సర్పంచి జిల్లెళ్ళ కిషోర్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. పెదకాకాని మండలం తంగెళ్ళమూడి గ్రామ సర్పంచి జిల్లెళ్ళ కిషోర్, సంగీత దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. వారి కుమార్తె శ్రావ్య రెండు నెలలుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధ పడింది. గుంటూరులోని డాక్టర్ సూచనల మేరకు గత శనివారం ఆమెను చెన్నై తీసుకు వెళ్ళారు. అక్కడికి వెళ్ళిన కొంత సమయానికి పరిస్థితి విషమించి చిన్నారి శ్రావ్య(4) మరణించింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తంగెళ్ళమూడిలోని కిషోర్ నివాసానికి చేరుకుని ఆ దంపతులను పరామర్శించి ఓదార్చారు. సర్పంచి కిషోర్ దంపతులను పరామర్శించిన వారిలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, బందెల ఉదయ్‌శంకర్ తదితరులు ఉన్నారు.

## వృద్ధుడిపై కత్తితో దాడి



కత్తిపోట్లకు గురైన వృద్ధుడు

వీరనాయకునిపాలెం(చేబ్రోలు): స్వల్ప వివాదంలో ఆవేశానికి గురైన యువకుడు వృద్ధునిపై కత్తితో దాడి చేసిన ఘటన చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వీరనాయకునిపాలెం గ్రామానికి చెందిన తోక సాంబయ్య వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. ఇంటి సమీపంలో బంధువు అయిన తోక గోపీనాథ్‌తో గురువారం వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో తోక సాంబయ్య, అతని ఇద్దరు కుమారులు గోపీనాథ్‌ను మందలించారు. దీనిని మనసులో పెట్టుకున్న గోపీనాథ్ పొలంలో ఒంటరిగా ఉన్న వృద్ధుడు సాంబయ్యపై కత్తితో దాడి చేశాడు. డొక్కలో, తొడ మీద మూడు చోట్ల కత్తితో పొడవటంతో సాంబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాంబయ్యను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కత్తెర పురుగుపై జాగ్రత్తలు అవసరం



వ్యవసాయ పంచాంగం, వ్యవసాయ మాస పత్రికలను అందజేస్తున్న దృశ్యం

చేబ్రోలు: మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లాం ఫాం శాస్త్రవేత్త శారద సూచించారు. చేబ్రోలులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అన్ని గ్రామాల సర్పంచ్‌లు, అభ్యుదయ రైతులకు సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్త శారద మాట్లాడుతూ జొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెగ్టిమ్ లేదా బెంజియోట్ లేదా స్పెనోశాట్‌ను పిచికారీ చేయాలన్నారు. గొంగళి పురుగు నివారణకు పది కిలోల తవుడు, 25 కిలోల బెల్లం, రెండు లీటర్ల నీరు కలిపి 24 గంటలు పులియపెట్టి ఆ మిశ్రమానికి వంద గ్రాముల థయోడికార్బ్ మందును కలిపి సాయంత్రం వేళలో మొవ్వలో వేయాలన్నారు. యూనివర్సిటీ ప్రచురించిన వ్యవసాయ పంచాంగం, వ్యవసాయ మాసపత్రికలను అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు. ఏవో బి.శ్రీనివాస నాయక్, ఏఈవో కె.సునీత, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సెల్ బ్యాటరీల చోరీపై కేసు

చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్శిటీ వద్ద సెల్ టవర్ బ్యాటరీల దొంగతనంపై చేబ్రోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీ ప్రాంగణంలోని సెల్ టవర్‌కు సంబంధించిన సుమారు రూ.80 వేలు విలువ చేసే 22 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దీనిపై సెక్యూరిటీ సిబ్బంది బుడ్డా వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నలుగురు అనుమానితులను చేబ్రోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన యువకులే చోరీకి పాల్పడినట్టు సమాచారం.

# పన్నుల వసూలు వేగవంతం చేయాలి



పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీనివాస్ నాయక్

కాకుమాను: గ్రామాల్లో ఇంటి, నీటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ కె.శ్రీనివాస్ నాయక్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటి, నీటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పన్ను వసూళ్లలో కాకుమాను మండలం వెనుకబడి ఉందని, దీనికి కారణం పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కేవలం 29 శాతం మాత్రమే వసూలు చేసినట్లు వివరించారు. నెలాఖరునాటికి నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ నాగానంద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డు నుంచి పేరు తొలగింపునకు అవకాశం

పెదకాకాని: కుటుంబంలో ఒకరు ఆదాయపన్ను కడుతూ ఇంటి యజమానికి పింఛన్ రాకపోయినట్లయితే ఆ రేషన్‌కార్డు నుంచి పేరు తొలగించుకుని కొత్త రేషన్‌కార్డు పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు తెలిపారు. ఇంట్లో ఇన్‌కమ్ టాక్స్ పేయర్ ఉన్నా, సొంత భూమి ఉన్నా, కారు ఉన్నా, 300 యూనిట్ల కన్నా కరెంటు బిల్లు ఎక్కువ వస్తున్నా పింఛన్ లబ్ధిదారులు ఉమ్మడి కుటుంబ కార్డు నుంచి డివైడ్ కావడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. వివరాలకు దగ్గరలోని సచివాలయాలను సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు.

# విధుల్ని బాధ్యతతో నిర్వహించాలి : జేసీ

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ శాఖల అధికారులంతా విధుల్ని బాధ్యతతో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా రవాణా, ఆహారం, నిత్యావసర సరుకుల సరఫరా తదితర అంశాల్లో చేసిన తనిఖీల వివరాల్ని సక్రమంగా అందించాలని ఆమె సూచించారు. పెట్రోల్ బంకులు, రేషన్ దుకాణాలు, హోటల్స్, రైస్ మిల్లర్లు ప్రజలకు అందించే సేవల్లో లోపాల్ని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా రెండో శుక్రవారం నిర్వహించే సమావేశాలకు తప్పక రావాలని చెప్పారు. సమావేశంలో డీఎస్ఓ పద్మశ్రీ, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

## ఉల్లిగడ్డల కషాయం తయారీపై శిక్షణ



ఉల్లిగడ్డల కషాయం తయారీ గురించి వివరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఉల్లిగడ్డల కషాయాన్ని వినియోగించి చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ కె.గురవయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలకు ఉల్లిగడ్డల కషాయం తయారీ విధానంపై శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిరప పంటలో నల్ల తామరను నివారించేందుకు ఉల్లిగడ్డల కషాయం ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో ఉల్లిగడ్డల కషాయాన్ని తయారు చేసుకుని పంటలపై పిచికారీ చేసుకోవచ్చన్నారు. కషాయం తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో పీఆర్‌పీ నాగరాజు, ఐసీఆర్‌పీ సరిత, నాగరాణి, ఎస్.శృతి, మాధవి, సుమతి, శాంతి, అనుష తదితరులు పాల్గొన్నారు.

### ● లెక్కల మాస్టార్‌గా కలెక్టర్



గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ లెక్కల మాస్టార్‌గా పాఠాలు బోధించారు. పట్టాభిపురంలోని రవీంద్రనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థుల తరగతి గదిని పరిశీలించారు. సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (ఎస్ఏ) పరీక్షల్లో వచ్చిన మార్కుల గురించి ఉపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గణితంలో 95 మార్కులు సాధించిన మీర్ సైదా, ఇంగ్లిష్‌లో 89 మార్కులు పొందిన యూసఫ్ లుక్మాన్, జి. గిరిధర్‌తో పాటు 86 మార్కులు పొందిన జి. సంరక్షితను అభినందించి, వారికి పెన్నులను బహూకరించారు. ఏప్రిల్‌లో జరిగే ఫైనల్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు వీలుగా ప్రీ-ఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేస్తానని చెప్పారు. విద్యార్థుల్ని గణిత శాస్త్రంపై ప్రశ్నలు అడిగారు. సబ్జెక్టు కష్టతరం కాదని, మనసు పెట్టి అర్థం చేసుకుంటే చాలా సులభమని సూచించారు. డ్రాయింగ్ క్లాసులో విద్యార్థులు వేసిన చిత్రాల్ని చూసి అభినందించారు. అనంతరం మన బడి నాడు-నేడు ద్వారా నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉపాధ్యాయులు ఎన్‌జీ తిలక్, జీఎస్ రామకృష్ణ ఉన్నారు.

## వృద్ధుడి అదృశ్యం



పుల్లగూర అయ్యేరు

పెదనందిపాడు: వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు అయినట్లు పెదనందిపాడు ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం రాజుపాలెం గ్రామానికి చెందిన 82 ఏళ్ల పుల్లగూర అయ్యేరు 19వ తేదిన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 94409 00872 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వివరించారు.

## ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్

ఏఎన్‌యూ: ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల 2022-23 విద్యా సంవత్సరం బీఫార్మసీ మొదటి సంవత్సర తరగతుల్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు అధికమవుతున్న ప్రస్తుత తరుణంలో ఫార్మసీ రంగం ప్రధాన పాత్ర వహిస్తోందని చెప్పారు. ఫార్మసీ కళాశాలకు అవసరమైన సదుపాయాలు అందిస్తామని తెలిపారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి మాట్లాడుతూ యువత సమాజాభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగాలని సూచించారు.

# సీఎంను కలిసిన సుచరిత దంపతులు



గుంటూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఆమె భర్త మాజీ ఇన్‌కంటాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్ శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఫ్లిప్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, తదితరులు

పట్నంబజారు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. పర్యావరణ ప్రగతి – మనందరి లక్ష్యం కావాలన్న సందేశంతో విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించే దిశగా ఐటీసీ, ఎమ్మెస్కే, ఫీనిక్స్ సంస్థలు ప్రత్యేకంగా ప్రచురించిన ఫ్లిప్ బుక్‌ను శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ అతివృష్టి లేదంటే అనావృష్టి, కరువు, కాటకాలకు ప్రధాన కారణం ప్రకృతిలో సమతుల్యత లోపించడమేనని తెలిపారు. ప్రకృతిని కాపాడడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో 20కోట్ల మొక్కలు నాటిందని గుర్తు చేశారు. కేవలం ప్రభుత్వం పూనుకున్నంతనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం కాదనీ, ప్రజలంతా భాగస్వాములైనప్పుడే విజయవంతమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సుస్థిరమైన పరిష్కార మార్గాలు తెలుసుకుని ప్రభుత్వానికి సహకరించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. అందమైన, ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కారానికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని చెప్పారు.





# వేగం కన్నా ప్రాణం మిన్న

డీటీసీ షేక్ కరీం



ప్రతిజ్ఞ చేస్తున్న డ్రైవర్లు

పట్నంబజారు: వేగం కన్నా ప్రాణం మిన్న అనే విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో లారీ, స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ రహదారి భద్రత సామాజిక బాధ్యతగా గుర్తెరగాలని సూచించారు. గత ఏడాది జిల్లాలో జరిగిన 1071 రోడ్డు ప్రమాదాల్లో 398 మంది మృతి చెందారని, 1011 మంది గాయపడి వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపారని వెల్లడించారు. విధులకు బయలుదేరే ప్రతి డ్రైవర్ ఒక్కసారి తన కుటుంబాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.రహదారి ప్రమాదరహిత జిల్లాగా గుంటూరును నిలపాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేయాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం ఎస్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ తమ ప్రయాణంలో ఏకాగ్రత కలిగి ఉండాలని చెప్పారు. రహదారి భద్రత సూచనలు పాటిస్తూనే.. ఇతర వాహనాల్ని ఓవర్ టేక్ చేయాలని సూచించారు. విద్యాసంస్థల డ్రైవర్లు బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు జీవితాలు తమపై నమ్మకంతో వాహనంలో ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలని చెప్పారు. రోడ్ సేఫ్టీ ఎన్జీవో రాజకుమారి మాట్లాడుతూ ప్రమాదాలబారిన పడిన ఎంతో మంది జీవచ్ఛవాలుగా బతుకుతున్నారని, ఇటువంటి పరిస్థితులు మరెవ్వరికీ రాకూడదని చెప్పారు. సదస్సులో ఎంవీఐలు రాఘవరావు, గోపాల్, మల్లీశ్వరి, సౌజన్య, ఏవో సత్యరాంతి, సిబ్బంది రాజీవ్ పాల్గొన్నారు.